సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 1 । జూలై । 2023



సేవల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ చర్యల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. IIలో



భూములపై ప్రజాభిప్రాయ సేకరణ

అనంతగిరి మండలంలో సుమారు 300 ఎకరాలకు తహసీల్దార్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. IIIలో



గంజాయితో ముగ్గురి అరెస్టు

కుమడ పంచాయతీ కేంద్రంలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఒడిశాకు తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. IIలో

న్యూస్‌రీల్

3న అల్లూరి శతజయంతి ఉత్సవాల ముగింపు

కొయ్యూరు: ఈనెల మూడవ తేదీన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శతజయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని రాజేంద్ర పాలెం అల్లూరి స్మారక మందిరంలో నిర్వహిస్తామని జాతీయ అల్లూరి యువజన సంఘం నిర్వాహక కార్యదర్శి శ్యామల వరలక్ష్మి, సహాయ కార్యదర్శి మాకాడ బూరులయ్య శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు విచ్చేస్తారన్నారు. రాజేంద్రపాలెం అల్లూరి స్మారక మందిరాన్ని ఉద్యానవనంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఉన్నామని వారు పేర్కొన్నారు.

గిరి యువతకు ఉపాధి



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

చింతపల్లి: ప్రధాన మంత్రి ఉపాధి హామీ పథకం ద్వారా గిరిజన యువతకు ఉపాధి కల్పిస్తామని అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. శుక్రవారం వివిధ బ్యాంకుల మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఉపాధి హామీ పథకం ద్వారా రుణాలు పొందే గిరిజనులకు 35 శాతం రాయితీ పొందవచ్చన్నారు. మావోయిస్టు బాధిత కుటుంబాలను 250 మందిని గుర్తించామని వారికి పథకానికి ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు రవి,శ్రీనివాస్, సీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకే పాలన


- ఎమ్మెల్సీ అనంతబాబు



వేటమామిడిలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అనంత బాబు

అడ్డతీగల: గ్రామ సచివాలయాలతో ప్రజలకు ముగింటకు పాలన చేరువైందని ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని వేటమామిడి, తుంగమడుగుల, డి.రామవరం గ్రామాల్లో గ్రామ సచివాలయాల భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలు ఏ సమస్య ఉన్నా పరిష్కారం కోసం రోజుల తరబడి అర్జీలు పట్టుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్దకు తిరిగేవారన్నారు. గ్రామవాలంటీర్లను నియమించి ఇళ్లకు వచ్చి అర్జీలు స్వీకరించి స్థానికంగానే పరిష్కరించేలా రాష్ట్రప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చిందన్నారు. దీనివల్ల ప్రజలకు అవస్థలు తప్పాయన్నారు. నిమ్మలపాలెంలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటుచేసే కార్యక్రమంలో భాగంగా రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న మంచినీటి ట్యాంకు, పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ భూమిపూజ నిర్వహించారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి మండలంలో రెండు సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం అంజలీ శనివారం, బలపం, జీకేవీధి మండలం, కొయ్యూరు మండలాల్లో పథకాన్ని పర్యవేక్షిస్తామన్నారు. పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు. జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, జెడ్పీటీసీ శివరత్నం, ఎంపీపీ కుమారి, ఎంపీటీసీలు వరలక్ష్మి, జయలక్ష్మి, పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్షయ తగ్గుతోంది



టీబీ వ్యాధిపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

- ఆశా కార్యకర్త పర్యవేక్షణలో మందుల వాడకం
- పౌష్టికాహారానికి రోగి ఖాతాలో నగదు జమ
- గ్రామాల్లో క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో సత్ఫలితాలు

జిల్లాలో రోజురోజుకు క్షయ వ్యాధి ప్రభావం తగ్గుతోంది. రోగులను గుర్తించిన వైద్యసిబ్బంది వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే క్రమం తప్పకుండా మందులు వాడేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రోగికి అవసరమైన పౌష్టికాహారానికి అయ్యే ఖర్చుకు సంబంధించి నిధులను వారి ఖాతాల్లో జమచేస్తోంది. జనాభా ప్రాతిపదికన నమోదు కావాల్సిన కేసుల కంటే తక్కువ ఉండటం అధికార యంత్రాంగానికి ఊరటనిస్తోంది.

పాడేరు రూరల్ : జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో క్షయ వ్యాధి (టీబీ) తీవ్రత రెండేళ్ల నుంచి క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. ఏజెన్సీలో ఎవరికైనా వ్యాధి లక్షణాలు ఉంటే కఫం (ఉమ్మి) పరీక్షకు రోజుల తరబడి సమయం పట్టేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాడేరు జిల్లా ఆస్పత్రిలోని టీబీ యూనిట్‌లో అధునాతనమైన సీబీ నాట్, ట్రూనాట్, మైక్రోస్కోపి ద్వారా నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ఒక్కరోజు వ్యవధిలోనే ఫలితాలు వస్తున్నాయి. దీంతో సత్వర వైద్యం పొందే అవకాశం ఏర్పడింది.

గతంలో పర్యవేక్షణలేక..

గతంలో స్థానికంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎటువంటి వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, అత్యాధునిక పరికరాలు ఉండేవి కాదు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గతంలో వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలకు సరిపడా మందులు ఒకేసారి ఇచ్చి వాడమనేవారు. పర్యవేక్షణ ఉండేది కాదు.

- ఇప్పుడు ఎవరైనా క్షయ వ్యాధి లక్షణాలతో బాధపడుతుంటే గ్రామాల్లో ఆశా కార్యకర్త, సీహెచ్‌డబ్ల్యూ వారిని వెంటనే ఆస్పత్రులకు తీసుకువచ్చి కఫం పరీక్ష, ఎక్స్‌రే పరీక్షలు చేయిస్తున్నారు.
- వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత రోగి యొక్క మందులను ఆశా కార్యకర్తకే అప్పజెబుతున్నారు. ఆమె ప్రతి నెల సమీపంలో ఉన్న ఆస్పత్రికి తీసుకువచ్చి పరీక్షలు చేయిస్తోంది. ఆ నెలలో రోగి యొక్క రోగ తీవ్రతను బట్టి ఆ నెలలో వాడాల్సిన మందులను ఆస్పత్రిలో వైద్యులు ఇస్తున్నారు.
- ప్రస్తుతం గ్రామాల్లో నిర్వహించే 104 వైద్య శిబిరాలు, ప్రత్యేక వైద్య శిబిరాలు, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాల ద్వారా గ్రామాల్లోకి వెళ్లినప్పుడు అయా గ్రా మాల్లో ఉండే క్షయ రోగుల ఆరోగ్య పరిస్థితిని వైద్యు లు, వైద్య సిబ్బంది ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటుతో..

టీబీ వ్యాధి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

- గ్రామాల్లో ఎవరైనా టీబీ లక్షణాలతో బాధపడుతున్నారో గుర్తించి వారిని ఆస్పత్రికి తీసుకువచ్చి వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత వ్యాధి గ్రస్తులకు ఆరు నెలల పాటు మందులు వాడించేలా వారిని పర్యవేక్షించే బాధ్యత ఆశ కార్యకర్త/ పర్యవేక్షకులకు అప్పజెబుతోంది. ఒకొక్క రోగికి రూ.వెయ్యి చొప్పున వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది.
- ప్రజల్లో క్షయ వ్యాధిని గుర్తించిన వారికి, ప్రైవేటు వైద్యులకు కూడా ఒక్కో కేసుకు రూ.500చొప్పున ప్రోత్సాహకం అందిస్తోంది.

రోగులకు అండగా..

పాడేరు ఏజెన్సీలో గతంలో టీబీ నిర్ధారణ అయిన వ్యక్తికి ఐటీడీఏ ద్వారా రాగిమాల్ట్, రాజ్‌మా, కంది పప్పు, గుడ్లు తదితర పౌష్టికాహార సరుకులు ఇచ్చేవారు. అయితే ఇవి సకాలంలో అందేవి కావు. పర్యవేక్షణ లోపం వల్ల రోగులు అవి వాడుతున్నారో లేదో తెలిసే పరిస్థితి ఉండేది కాదు. ప్రస్తుతం ప్రభుత్వం టీబీ వ్యాధి బారిన పడిన వారికి పౌష్టికాహారం నిమిత్తం ప్రతి నెలా రూ.500 చొప్పున ఆరు నెలల పాటు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. ఇదే కాకుండా గిరిజన ప్రాంతాల్లో క్షయ రోగులకు అదనంగా మరో రూ.750 సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ సొమ్ము వారి పౌష్టికాహారానికి ఎంతగానో తోడ్పడుతోంది.

గిరిజన ప్రాంతాల్లో..

క్షయ వ్యాధి గిరిజన ప్రాంతంల్లో ఎక్కువగా సోకేది. గతంలో మారుమూల గిరిజనుల్లో అడ్డపొగ తాగే అలవాటు ఉండటం, స్థానిక వాతావరణ పరిస్థితులు కారణంగా ఉండేవి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే వారిలో కూడా ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. ఇప్పుడు చాలామంది గిరిజనులు ఇప్పుడు అడ్డపొగ తాగడం మానేశారు. చిన్నారులకు సైతం అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన పౌష్టికాహారం అందిస్తుండటంతో రోగ నిరోధక శక్తి పెరగడంతో కూడా వ్యాధి తగ్గుముఖం పడుతోంది.

క్రమం తప్పకుండా మందులు వాడాను

క్షయ లక్షణాలు ఉండటంతో ఆశా కార్యకర్త స్థానికంగా ఉన్న ఆస్పత్రిలో పరీక్షలు చేయించారు. వ్యాధి నిర్ధారణ కావడంతో వైద్యులు మందులు ఇచ్చారు. వీటిని ఆశా కార్యకర్త పర్యవేక్షణలో వాడాను. ఆరు నెలలకు నా బ్యాంక్ ఖాతాలో పౌష్టికాహారం నిమిత్తం ప్రభుత్వం రూ.3750 జమ చేసింది. మంచి పౌష్టికాహారం తీసుకోవడంతో వ్యాధి పూర్తి నయమైంది.

– బి. సన్యాసినాయుడు, కొంతిలి, హుకుంపేట మండలం

నిత్యం పర్యవేక్షణ



గ్రామాల్లో తరచూ క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం ద్వారా గ్రామాల్లోకి వెళ్లినప్పుడు కూడా వైద్యులు, సిబ్బంది రోగులను పర్యవేక్షిస్తున్నారు. క్రమం తప్పకుండా ఆరు నెలలపాటు మందులు, పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నయమవుతుంది. జిల్లాలో క్షయ వ్యాధి కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతోంది.

– డాక్టర్ తమర్ప విశ్వేశ్వరనాయుడు, జిల్లా క్షయ, కుష్ఠు నివారణ విభాగం అధికారి, పాడేరు



పాడేరు జిల్లా ఆస్పత్రి ల్యాబ్‌లో ఏర్పాటుచేసిన అత్యాధునిక క్షయ వ్యాధి నిర్ధారణ పరికరాలు

క్షయ కేసుల వివరాలు

2022లో..		
శాంపిళ్ల లక్ష్యం	:	15,347
సేకరించినవి	:	16,210
జనాభా ప్రకారం		
ఉండాల్సిన కేసులు	:	2476
నమోదైన కేసులు	:	1164
2023 జూన్ 24 వరకు..		
శాంపిళ్ల లక్ష్యం	:	10,300
సేకరించినవి	:	7291
జనాభా ప్రకారం		
ఉండాల్సిన కేసులు	:	1010
నమోదైన కేసులు	:	539

ఫార్మాలో విషాదం

- సెజ్‌లో భారీ అగ్నిప్రమాదం
- ఇద్దరు కార్మికుల మృతి.. నలుగురి పరిస్థితి విషమం



ఫార్మా కంపెనీలో ఎగసిపడుతున్న మంటలు

రాంబిల్లి : గతంలో ఎన్నడూ చూడని విధంగా అగ్ని కీలలు.. ఆకాశాన్ని అంటుతున్నట్టుగా ఎగసిపడుతున్న మంటలు.. దట్టంగా కమ్ముకున్న పొగ.. భారీ శబ్దాలు.. ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి.. హాహాకారాలు చేస్తూ కార్మికుల పరుగులు.. సమీప గ్రామాల ప్రజల్లో భయాందోళన.. ఇదీ శుక్రవారం అచ్యుతాపురం–రాంబిల్లి సెజ్‌లోని సాహితి ఫార్మా పరిశ్రమలో పరిస్థితి. వివరాలు.. ఉదయం ఎ-షిఫ్ట్‌కు 35 మంది కార్మికులు హాజరయ్యారు. సాల్వెంట్ లోడింగ్ చేస్తుండగా 11.10 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. క్షణాల్లో వ్యాపించాయి. ఈ క్రమంలో సమీపంలో ఉన్న రెండు రియాక్టర్లు భారీ శబ్దంతో పేలాయి. పొగలు, మంటలు, భారీ శబ్దాలతో ఈ ప్రాంతం దద్ద రిల్లిపోయింది. దిక్కుతోచని కార్మికులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు గాయపడ్డారు. వీరిలో అచ్యుతాపురం మండలం జంగాలపాలేనికి చెందిన పైల సత్తిబాబు(35), విజయనగరానికి చెందిన తిరుపతి(28)లను విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన రాంబిల్లి మండలం పంచదార్లకు చెందిన ఎస్.నూకినాయుడు(48), భువనేశ్వర్‌కు చెందిన రామేశ్వర్(40), నక్కపల్లికి చెందిన ఎస్.అప్పారావు(43), అనకాపల్లి మండలం రేబాకకు చెందిన ఎస్.రాజుబాబు(23)లు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని అధికారులు తెలిపారు. కొండ కొప్పాకకు చెందిన సంతోష్‌కుమార్ స్వల్ప గాయాలతో అచ్యుతాపురం స్టార్ జెన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఏడు ఫైరింజన్లతో మంటలను అదుపుచేయవలసి వచ్చింది. మంటలు అదుపు చేసే ప్రయత్నంలో మరో ముగ్గురు అగ్నిమాపక సిబ్బంది గాయపడ్డారు.

భద్రత ప్రమాణాలు పాటించట్లేదు

కంపెనీల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకున్నా అధికారులు పట్టించుకోలేదని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు)అన్నారు. కంపెనీ వద్ద ప్రమాద పరిస్థితిని ఆయన పరిశీలించి విలేకరులతో మాట్లాడుతూ, ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ల తీరు దారుణంగా ఉందన్నారు. తగిన భద్రతా చర్యలు తీసుకుంటే ఇటువంటి ప్రమాదాలు జరగవన్నారు. విచారణ తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా ఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవో, తహసీల్దార్ ఇతర అధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

'నవరత్నాలు'తో గొడుగుల పంపిణీ



నవరత్నాలను ముద్రించిన గొడుగులను అందజేస్తున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

- రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు వినూత్న ఆలోచన
- ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నం

పాడేరు రూరల్ : రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు వినూత్నంగా ఆలోచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలపై ప్రజలకు మరింత అవగాహన పెంచేందుకు తనవంతు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా పాడేరు నియోజకవర్గంలో నవరత్నాల లోగోను ముద్రించిన 1500 గొడుగులను పార్టీ నాయకులు, కార్యకర్తలు పంపిణీ చేపట్టారు. తొలుత శుక్రవారం పాడేరు మండలానికి చెందిన పలువురు పార్టీ శ్రేణులకు 100 గొడుగులను లోచలిపుట్టులోని తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలతో గిరిజనులకు ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. వీటిని ప్రజల్లోకి మరింత తీసుకువెళ్లాలన్న సంకల్పంతో నవరత్నాలను ముద్రించిన గొడుగులను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాడేరు మండల మాజీ అధ్యక్షుడు కూడా సింహాచలం, టౌన్ అధ్యక్షుడు దన్నేటి పలాసి రాంబాబు, పార్టీ నాయకులు ముదిలి సత్యానారాయణ, పాంగి నవీన్, సామేష్, పలాసి రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జగనన్న సురక్ష

- విజయవంతానికి ఏర్పాట్లు
- మండలానికి రెండు అధికారుల బృందాలు

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష పథకం శనివారం నుంచి జిల్లాలో ఘనంగా ప్రారంభించేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతీ మండలానికి తహసీల్దార్, ఎంపీడీవోలతో కూడిన రెండు అధికారుల బృందాలను ఏర్పాటు చేశారు. ఈనెల 27వతేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష పథకం నిర్వహిస్తారు. ఇటీవల వారం రోజుల పాటు అన్ని సచివాలయాల పరిధిలో వలంటీర్లంతా ఇంటింటా తిరిగి సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పథకాలకు నోచుకోని లబ్ధిదారులను గుర్తించారు. వారికి అవసరమైన 11రకాల ధ్రువపత్రాలను జగనన్న సురక్షా పథకంలో సచివాలయాల్లో పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.తొలిరోజు జిల్లాలోని 19 సచివాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోండి: కలెక్టర్ సుమిత్‌కుమార్

జిల్లాలో శనివారం నుంచి జరిగే జగనన్న సురక్ష పథకంలో ప్రజాప్రతినిధుల సహకారం తీసుకొని సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రత్యేకాధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. సచివాలయాల పరిధిలో నిర్వహించే శిబిరాలపై ముందుగానే ప్రచారం చేయడమే కాకుండా ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ధ్రువపత్రాలు 11 రకాలు జారీ చేసిన వెంటనే ఆయా పథకాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో జనరేట్ చేయాలన్నారు. శిబిరాలు నిర్వహించే ప్రాంతాలలో పరిశుభ్రత పాటించాలని, షామియానాతో పాటు వేడిసీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు.ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని, బ్యాంకు ఖాతాలతో ఆధార్ లింకేజికి సంబంధించి ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. పూర్తిస్థాయిలో మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జేసీ శివశ్రీనివాస్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ,పలు మండలాల ప్రత్యేకాధికారులు మురళి, కొండలరావు, వీఎస్ కుమార్, గోవిందరాజులు, ఎన్.సూర్యలక్ష్మి, సచివాలయాల జిల్లా సమన్వయకర్త సునీల్ పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యతపై ప్రభుత్వానికి నివేదిక

- పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ అమర్నాథ్‌రెడ్డి
- కోతకు గురై కొట్టుకుపోయిన రహదారి పరిశీలన
- పలు చోట్ల శాంపిళ్ల సేకరణ



రంగబయలు రోడ్డును పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ అమర్నాథ్‌రెడ్డి, అధికారులు



రోడ్డు నుంచి శాంపిళ్లను సేకరిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

ముంచంగిపుట్టు: మండలంలోని రంగబయలు పంచాయతీ కేంద్రానికి నిర్మించిన తారు రోడ్డు నాణ్యతపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ (విజయవాడ) అమర్నాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో స్టేట్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు వనుగుమ్మ పంచాయతీ ఆసరాడ ఆర్అండ్‌బీ రహదారి నుంచి రంగబయలు పంచాయతీ కేంద్రం మీదుగా జోడిగుమ్మ వరకు నిర్మించిన రహదారిని పరిశీలించారు. పలు చోట్ల శాంపిళ్లు సేకరించారు. పంచాయతీరాజ్ ఏఈ, కాంట్రాక్టర్‌కు వారు పలు సూచనలు చేశారు. వెంటనే కొండ ప్రాంతంలోని ఘాట్ మలుపుల వద్ద రక్షణ గోడలు నిర్మించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని, వర్షాకాలం అనంతరం పూర్తిస్థాయిలో శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ రహదారిలో కోతకు గురైన ప్రదేశాలను పరిశీలించామని చెప్పారు. వెంటనే వాహన రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో కన్సల్టెంట్ ప్రభాకర్, పంచాయతీరాజ్ ఎస్ఈ దేవేంద్ర పాల్గొన్నారు.

డాక్టర్స్ డే శుభాకాంక్షలు

Advt. Feature

సేవల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరిక

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ చర్యల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం తన కార్యాలయం నుంచి వైద్యాధికారులు, వైద్యబృందాలతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లులు, చిన్నారులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ప్రధానమంత్రి మాతృవందన యోజన, జననీ సురక్ష పథకాల ప్రయోజనాలను లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని ఆదేశించారు. గర్భిణులు,బాలింతలు,శిశువుల గణాంకాలు సక్రమంగా ఉండాలని, టీకాల కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తే సంబంధిత ఏఎన్ఎంలను సరెండర్ చేస్తామని హెచ్చరించారు.గతేడాది 24వేల ప్రసవాలు జరిగితే కేవలం 11వేల బాలింతలకు మాత్రమే జననీ సురక్ష యోజన పథకం అమలుజేశారన్నారు. మిగిలిన ఎనిమిది వేలమందికి బ్యాంకు ఖాతాలు లేకపోవడం వల్ల ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందలేదన్నారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల సమగ్ర వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం ఇమ్యునైజేషన్ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలని, వైద్యసేవల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. సీడీపీవోలు, వైద్యులు వారి సిబ్బందితో నెలకు రెండు సమావేశాలు నిర్వహించి వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు.అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, పీఎంయూ ప్రాజెక్టు అధికారి రాంగోపాల్, పాడేరు సీడీపీవో ఝాన్సీరాణి పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే ఎలా?

- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆగ్రహం
- రంగబయలులో కోతకు గురైన రహదారి పరిశీలన




కోతకు గురైన రంగబయలు–జోడిగుమ్మ రహదారిని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: రూ.కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న రహదారుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే ఎలా అని పంచాయతీరాజ్ అధికారులు, కాంట్రాక్టర్‌పై ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని రంగబయలు పంచాయతీలో శుక్రవారం ఆమె పర్యటించారు. పీఎంజీఎస్‌వై కింద 16.90కోట్లతో నిర్మించిన తారురోడ్డు కొన్ని నెలలకే ఇటీవల కురిసిన వర్షాలు పలు చోట్ల కోతకు గురికావడంపై పత్రికల్లో కథనాలు రావడంతో ఆమె స్పందించారు. కోతకు గురైన రహదారిని పరిశీలించారు. కొండ ప్రాంతంలో మలుపులు వద్ద నాణ్యత లోపించడం, రహదారికి రక్షణ గోడలు లేకపోవడంపై ఆమె అసహనం వ్యక్తంచేశారు. మీ నిర్లక్ష్యం వల్లే రంగబయలు రోడ్డు ఇలా అయిందని, దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని పంచాయతీ రాజ్ అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కోతకు గురైన రహదారిలో అధ్వాన పరిస్థితులను మెరుగుపరచడమే కాకుండా రక్షణగోడలు నిర్మించాలని సూచించారు. రానున్న రోజుల్లో రహదారి పరిస్థితి మళ్లీ ఇలాగే ఉంటే ఉపేక్షించేది లేదని కాంట్రాక్టర్, అధికారులను హెచ్చరించారు. అనంతరం ఆప్రాంత గిరిజనులతో ఆమె మాట్లాడారు. అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకున్నారు. గతంలో 20 కిలో మీటర్ల దూరంలో వనుగుమ్మ పంచాయతీ అసరాడ వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకునే వారమని, ఇప్పుడు ఆ కష్టాలు తొలగాయని వారు వివరించారు. తారు రోడ్డు వల్ల రేషన్ బియ్యం వాహనం వచ్చి అందిస్తుందని జోడిగుమ్మ, మట్టిగూడ. కోసంపుట్టు, పట్నపడాల్‌పుట్టు గ్రామాల గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పాంగి మల్లికార్జున్, సర్పంచ్‌లు గంగాధర్, నీలకంఠం, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, లబ్బో తదితరులు పాల్గొన్నారు.

పాఠాలు బోధించిన సుభద్ర

రంగబయలు పంచాయతీ మట్టిగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర తనిఖీ చేశారు. కొంతసేపు ఆమె విద్యార్థులకు పాఠాలు బోధించారు. గతంలో టీచర్‌గా పని చేసిన రోజులను ఆమె గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకొని చదువుకోవాలని సూచించారు.జగనన్న విద్యా దీవెన కిట్లు పంపిణీ వివరాలు తెలుసుకున్నారు.





స్పందన వినతుల సత్వర పరిష్కారం



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

సాక్షి, పాడేరు: స్పందనలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయడమే కాకుండా సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. శనివారం నుంచి జరిగే జగనన్న సురక్ష పథకం గ్రామసభలను అన్నిశాఖల అధికారులు విజయవంతం చేయాలని కోరారు. గిరిజనుల నుంచి 130 వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ, ఐటీడీఏ ఏపీవో(జనరల్) ప్రభాకర్, డీఆర్వో పి.అంబేద్కర్, ఎస్‌డీసీ శర్మ, డీఆర్‌డీఏ పీడీ మురళి, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు నందు, రమేష్‌కుమార్, పలు ఇంజనీరింగ్ విభాగాల ఈఈలు బాలసుందర బాబు, డీవీఆర్ఎం రాజు,లీలాకృష్ణ పాల్గొన్నారు.

ప్రత్యక్ష దైవాలు వైద్యులు



మహారాణిపేట: స్వచ్ఛమైన తెల్లని కోటు, ఆత్మీయమైన చెరగని చిరునవ్వు, మొక్కవోని నిబ్బరం, అలుపెరగని అంకితభావం, విసుగెరగని వృత్తి ప్రేమ వైద్యునికి సహజ ఆభరణాలు. ఈ ఆభరణాలు ధరించి వచ్చే వైద్యుడిని చూడగానే రోగికి సగం స్వస్థత చేకూరుతుంది. తల్లి జన్మనిస్తే.. వైద్యుడు పునర్జన్మనిస్తాడు. నేడు జాతీయ వైద్యుల దినోత్సవం. వైద్యుడు, రాజకీయ వేత్త, విద్యావేత్త అయిన డాక్టర్ బీదాన్ చంద్ర రాయ్ సేవలకు గుర్తింపుగా డాక్టర్స్ డే జరుపుకుంటున్నాం.

జాయింట్ రీప్లేస్‌మెంట్‌కు కేరాఫ్ క్యూ1



రాష్ట్రంలో రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ అంటే గుర్తుకొచ్చేది ఆరిలోవ హెల్త్‌సిటీలోని క్యూ1ఆస్పత్రి. కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సల్లో ప్రసిద్ధి గాంచిన డాక్టర్ రమణమూర్తి నేతృత్వంలో అత్యంత అనుభవజ్ఞులు, నిపుణులైన వైద్య బృందం, సిబ్బంది ఇక్కడ అందుబాటులో ఉన్నారు. రాష్ట్రంలో ప్రప్రథమ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్, కంప్యూటర్ నావిగేషన్ టెక్నాలజీ సెంటర్ ఇదే. కీళ్ల మార్పిడికి ప్రత్యేకించి ప్రపంచస్థాయి అడ్వాన్స్‌డ్ లామినర్ ఫ్లో ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. కీళ్ల వ్యాధులను నిర్ధారించే అన్ని రకాల రేడియాలజీ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రపంచ దేశాల్లో లభించే ప్రతి కృత్రిమ జాయింట్ ఇక్కడ అందుబాటులో ఉంది. జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన డాక్టర్ రమణమూర్తి 20 ఏళ్ల కాలంలో దాదాపు 25 వేల జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సలు చేశారు. అధునాతన టెక్నాలజీతో శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ఆర్థరైటిస్‌లో కూడా వైద్య సేవలు అందిస్తున్నారు. శస్త్ర చికిత్స జరిగిన రెండో రోజు నుంచే నడక ప్రారంభించవచ్చని డాక్టర్ రమణమూర్తి తెలిపారు. చాలా మంది పురుషులతో పాటు మహిళలు, ముఖ్యంగా వృద్ధులు పని ఒత్తిడి, వయసురీత్యా, వివిధ కారణాలతో ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారు. వారికి రోబోటిక్ అసిస్టెడ్ కీళ్లమార్పిడి చికిత్స ద్వారా ఉపశమనం కలగజేయవచ్చని వివరించారు.

వైద్యంతో పాటు సేవలు



ఆ కుటుంబంలో మొత్తం వైద్యులుగా సేవలందిస్తున్నారు. డాక్టర్ గంటా వెంకటేశ్వరరావు జనరల్ ఫిజీషియన్‌గా, అతని భార్య గంటా లలిత గైనకాలజిస్ట్‌గా, కుమార్తె డాక్టర్ సునీత ప్లాస్టిక్ సర్జన్‌గా, అల్లుడు రఘు ఆర్థోపెడిక్ రంగంలో వైద్యుడిగా పని చేస్తున్నారు. 40 ఏళ్లుగా వైద్య రంగంలో ఉంటూ విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. నీటి కోసం గిరిజనుల పడుతున్న కష్టాలను స్వయంగా చూసిన డాక్టర్.. వారి కోసం వాటర్ ట్యాంకు నిర్మించారు. పెందుర్తిలో వృద్ధుల ఆశ్రమానికి రూ.12 లక్షల నిధులతో, నరవ వద్ద అనాథ పిల్లల ఆశ్రమానికి రూ.8 లక్షల వ్యయంతో సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించారు.

కంటి పాపలకు రక్ష



చిన్నారుల కంటి సంరక్షణకు విశాలాక్షినగర్‌లోని విజన్ ట్రీ ఆస్పత్రి విశేషంగా కృషి చేస్తోంది. ఏటా చిన్న పిల్లలకు కంటి పరీక్షలు చేయించడం ద్వారా అంధత్వానికి గల కారణాలను ముందుగా గుర్తిస్తున్నారు. దీని వల్ల కొంతవరకు అంధత్వాన్ని నివారించవచ్చని డాక్టర్ మధు ఉద్దరాజు తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కంటికి మేలు జరుగుతుందన్నారు. ఆకుకూరలు, క్యారెట్, పాలు, గుడ్లు, చేప వంటివి ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కళ్లకి సరైన విశ్రాంతి అవసరమని, ప్రతి రోజూ 7 నుంచి 8 గంటల వరకు నిద్రపోవాలన్నారు. ప్రతి రోజూ 40 నుంచి 60 నిమిషాల పాటు చిన్నారులు ఆరుబయట ఆటలు ఆడటం ద్వారా కంటికి మంచి జరుగుతుంది.






గంజాయితో ముగ్గురి అరెస్టు

ముంచంగిపుట్టు : ముంచంగిపుట్టు మండలం కుమడ పంచాయతీ కేంద్రంలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఒడిశాకు తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన బైకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ కె.రవీంద్ర కథనం ప్రకారం వివరాలివి. ముందస్తు సమాచారంతో కుమడ జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం ఎస్‌ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టగా భూసిపుట్టు నుంచి కుమడ జంక్షన్ వైపు వస్తున్న రెండు బైకులపై వ్యక్తులు పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకొని తనిఖీ చేయగా బ్యాగుల్లో 40 కిలోల గంజాయిని గుర్తించారు. దీంతో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ. 80వేలు ఉంటుందని, పట్టుబడిన వారిలో ఒడిశా రాష్ట్రం కొర్రాపుట్టు జిల్లా నందపూర్ బ్లాక్ బిల్లాపుట్టు పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామానికి చెందిన దేవ గోల్లారి, మల్కన్‌గిరి జిల్లా పాప్పర్లమెట్ట పంచాయతీ లొగూడ గ్రామానికి చెందిన అనంతం గలారిలుతో పాటు ముంచంగిపుట్టు మండలం మాకవరం పంచాయతీ మేభా గ్రామానికి చెందిన జోర్లాయి చంద్రసేన్‌లుగా గుర్తించామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి ముగ్గురు గంజాయి స్మగ్లర్లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రవీంద్ర తెలియజేశారు. ఈ తనిఖీలో ముంచంగిపుట్టు పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో నిందితుడి అరెస్టు

పాడేరు రూరల్ : పాడేరు ఘాట్‌లో ఈనెల 25న ప్రమాదానికి గురైన మహీంద్ర ఎక్స్‌యూవీ వాహనంలో లభ్యమైన గంజాయి కేసులో గంజాయి సరఫరా దారుడిని శుక్రవారం పాడేరు పోలీసులు అరెస్ట్ చేశారు. పాడేరు సీఐ సుధాకర్ తెలిపిన వివరాలివి. ఈనెల 25న ఘాట్‌లో ప్రమాదానికి గురైన వాహనంలో లభ్యమైన 400కిలోల గంజాయి కేసును లోతైన విచారణ జరిపామన్నారు. సరైన టెక్నికల్ ఆధారాలతో పాటు సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా పాడేరు పోలీసులు నిందితులను గుర్తించారన్నారు. ఈ కేసులో గంజాయి సరఫరా చేసిన ముంచంగిపుట్టు మండలం కుమడ పంచాయతీ బంద్రగూడ గ్రామానికి చెందిన సింహాద్రిను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయి సరఫరా చేసేందుకు ఉపయోగించిన బైక్‌ను సీజ్ చేశామన్నారు. ఈ కేసులో మిగిలిన నిందితులను కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని సీఐ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐలు లక్ష్మణ్, రంజిత్‌కుమార్‌లను అభినందించారు.



హత్యాయత్నం కేసులో నలుగురికి ఏడేళ్ల జైలు

చోడవరం రూరల్/డుంబ్రిగుడ : తన భర్తతో వివాహేతర సంబంధం కలిగి ఉందన్న అనుమానంతో పొరుగింటి గృహిణిని నమ్మించి తమ వెంట అరకు తీసుకెళ్లి నిర్జన ప్రదేశంలో ఆమెను హత్య చేయడానికి ప్రయత్నించిన మహిళతో పాటు మరో ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ చోడవరం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సత్తి అరుణశ్రీ శుక్రవారం తీర్పు చెప్పారు. అడిషనల్ పీపీ వేచలపు వెంకటరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురానికి చెందిన నిందితులు కర్రి షర్మిల, మామిడి త్రివేణి, సరిపల్లి సరోజిని, కొత్తపల్లి దుర్గ విశాఖపట్నం, కంచరపాలెం రాజీవ్‌నగర్ కాలనీలో ఉంటున్నారు. విశాఖలోని కంచరపాలెం, కప్పరాడలో గనిరెడ్డి కమల నివాసం ఉంటుంది. కర్రి షర్మిల భర్త సోమేష్ తన భార్యతో గొడవ పడినప్పుడల్లా తాను గనిరెడ్డి కమలను రెండో వివాహం చేసుకుంటానంటూ బెదిరించేవాడు. ఈ నేపథ్యంలో షర్మిల 2016 మే నెల 5న తామంతా పార్వతీపురం వెళ్తున్నట్టు కమలకు కబురు పెట్టారు. కమల తన ఏడాదిన్నర వయసు గల కుమారుడిని వెంట పెట్టుకుని వారితో బయలు దేరింది. అయితే ఆమెను అరకు వెళ్లే రైలు ఎక్కించగా ఆమె ప్రశ్నించడంతో అరకు చూసుకుని వెళదామంటూ నమ్మబలికారు. అరకులో రైల్వేస్టేషన్‌కు సుమారు కిలోమీటర్ దూరంలో నిర్జన ప్రదేశంలో కమలను ఓ చెట్టు వద్దకు తీసుకెళ్లిన షర్మిల ఆమెతో గొడవపడింది. తన భర్తతో ఆమెకు సంబంధంపై నిలదీసింది. నలుగురూ కలిసి కమల మెడలోని చున్నీతో ఆమె గొంతు బిగించి చంపడానికి ప్రయత్నించారు. కమల కేకలు వేయడంతో జనం వస్తుండడాన్ని గమనించి నలుగురూ ఆమెను వదిలి కమల ఏడాదిన్నర కుమారుడు తరుణ్‌ను తీసుకుని పరారయ్యారు. ఆ బిడ్డను ఎస్.కోటలో రోడ్డుపై విడిచిపెట్టి వెళ్లిపోయారు. రక్తస్రావంతో అపస్మారక స్థితిలో ఉన్న కమలను స్థానికులు 108లో అరకు ఆస్పత్రికి తరలించారు. ఎస్‌.కోట పోలీసులు ఒంటరిగా రోడ్డుపై రోధిస్తున్న తరుణ్‌ను గుర్తించి అనాథలకు సేవ చేసే నేచర్ సంస్థకు అప్పగించారు. కాగా ఆస్పత్రిలో కోలుకున్న కమల వాంగ్మూలం మేరకు డుంబ్రిగుడ ఎస్‌ఐ వై.అమన్‌రావు కేసు నమోదు చేసి, నిందితులు నలుగురిపై ఐపీసీ 363, 307, 323 రెడ్ విత్ 34 సెక్షన్లతో ఛార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన సబ్‌జడ్జి సత్తి అరుణశ్రీ నిందితులపై మోపిన అభియోగాలు సాక్ష్యాధారాలతో రుజువు కావడంతో ఒక్కొక్కరికి ఏడేళ్ళపాటు కఠిన కారాగార శిక్షను విధిస్తూ తీర్పు చెప్పారు.

